
క్లుప్తంగా

భీమ నాగలింగేశ్వర స్వామికి పూజలు


శ్రీశైల మల్లన్నగా స్వామివారు

దెందులూరు: గాలాయగూడెంలోని శ్రీ అచ్చమ్మ పేరంటాలు తల్లి ఆలయ ఆవరణలో వెలసిన శ్రీశ్రీశ్రీ భీమ నాగలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం స్వామి వారికి అర్చకులు సుశీల్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. శ్రీశైలం మల్లన్నగా దర్శనమిచ్చిన స్వామివారిని భక్తులు దర్శించి తరించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వామివారిని దర్శించిన ప్రవచనకర్త మల్లేశ్వర శర్మను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

రహదారి మరమ్మతులు


వంతెన వద్ద రహదారి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరు వంతెన వద్ద రహదారికి మరమ్మతు పనులు నిర్వహించారు. వంతెన వద్ద గోతులు ఏర్పడడంతో చాలాకాలంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచి బండారు సింధు ఆదివారం ఈ గోతులను పూడ్చించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

150 మందికి వైద్య పరీక్షలు


పూళ్ల వైద్య శిబిరంలో చిన్నపిల్లలకు పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు జి.రవీంద్రనాథ్

భీమడోలు: పూళ్ల వర్తక సంఘం కల్యాణ మండపంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పుప్పాల మోహనసీతారామయ్య ఫౌండేషన్ అధినేతలు పుప్పాల శ్రీనివాస్, పుప్పాల హరీష్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ప్రారంభించారు. ఏలూరుకు చెందిన శ్రీకృష్ణా ఆసుపత్రి చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గుండపనేని రవీంద్రనాథ్, గైనిక్ నిపుణురాలు డాక్టర్ గుండపనేని రోషిణిల బృందం రోగులకు వైద్య సేవలందించారు. పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన 150 మంది చిన్నపిల్లలు, మహిళలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నోచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సువార్త కూడికల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


భీమడోలులో సువార్త కూడికల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫాదర్లు

భీమడోలు: క్రైస్తవ విశ్వాసులంతా తోటివారి పట్ల ప్రేమ, సహనం కలిగి ఉండాలని భీమడోలు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ అనిల్ అన్నారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఏప్రిల్ 5, 6, 7వ తేదీల్లో చర్చి ప్రాంగణంలో జరిగే నిత్య సహాయమాత 38వ సజీవధారల సువార్త కూడికల గోడ పత్రాలను గ్రామ పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. సువార్త కూడికల్లో విశ్వాసులు పాల్గొని దేవుని దీవెనలను పొందాలన్నారు. కార్యక్రమంలో విచారణకర్త ఫాదర్ షింటోథామస్, మోక్ష, సంఘ పెద్దలు, విన్సంట్ డీపాల్ సొసైటీ సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

దెందులూరు: పోతునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దొండపాడు ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో డౌన్ సిండ్రంపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీడీఆర్‌సీ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ సిండ్రోమ్ ఉన్న వ్యక్తుల జీవన నాణ్యత మెరుగుపరచవచ్చన్నారు. అనునిత్యం వైద్యుల తనిఖీలు పర్యవేక్షణలో ఫిజియోథెరపీ స్పీచ్ థెరపీ వైద్య సేవలను అందించడంతోపాటు నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. సమావేశంలో దివ్యాంగుల పునరావాస కేంద్రం వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

మొక్కజొన్న ధర పతనంతో దిగాలు

- బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో పడిన ధర
- నష్టాలు తప్పవంటూ రైతుల ఆవేదన


మొక్కజొన్న పంట

దెందులూరు: బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. మొన్నటివరకు ధర బాగానే పలికినా ప్రస్తుతం అమాంతంగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వరి, పామాయిల్ తర్వాత రైతులు మొక్కజొన్న పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. కోళ్లు, చేపలు, గేదెల మేతకు మొక్కజొన్నను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఏలూరు జిల్లాలో చేపలు, రొయ్యలు, చెరువుల యజమానులు తూర్పుగోదావరి, కాకినాడ, ఏలూరు జిల్లాల కోళ్ల ఫారం రైతులు, నిర్వాహకులు మొక్కజొన్నను కొనుగోలు చేస్తారు.

పడిన ధరతో ఆందోళన

జిల్లాలో ఈ ఏడాది 41 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. పంట దిగుబడి బాగా రావడంతో రైతులు తమ కష్టాలు తీరతాయని సంబరపడ్డారు. అయితే ఇంతలోనే బర్డ్‌ఫ్లూ వారి ఆశలపై నీళ్లు చల్లింది. ప్రారంభంలో మొక్కజొన్న రూ. 2800 ధర ఉండగా బర్డ్‌ఫ్లూ దెబ్బకి అమాంతంగా రూ.2200కి పడిపోయింది. ఆరుగాలం కష్టించి సాగుచేసినా ధర పడిపోవడంతో నష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

మిగిలేది స్వల్పమే

ఎకరం పొలంలో మొక్కజొన్న పండించేందుకు రైతుకు రూ.40 వేలు అవుతుంది. ఎకరానికి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. పెట్టుబడి పోను రైతుకి రూ.28 వేలు మాత్రమే మిగులుతుంది. ఇంజన్లతో నీరు తోడి తవుడు పెట్టి రైతులకు అంత కూడా మిగిలే పరిస్థితి లేదు. ప్రభుత్వ పరంగా మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించే అవకాశాలు లేకపోవడంతో రైతులు వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్ముకుంటున్నారు. సీడ్ పండించిన రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది. ఎకరానికి మూడు టన్నుల వరకు పండిస్తున్నారు. టన్ను సీడ్ కు రూ.30 వేలు వరకు చెల్లిస్తున్నారు. కార్పొరేట్ కంపెనీలు రైతులకు నాటేందుకు సీడ్ ఇచ్చి పెట్టుబడి పెడతాయి. తరువాత వారి వద్ద నుంచి అగ్రిమెంట్ ధరకు కొనుగోలు చేస్తాయి.


మొక్కజొన్న గింజలను ఆరబెడుతున్న రైతు


కొనుగోలు లేక రోడ్డుపై ఉంచిన మొక్కజొన్న

వడదెబ్బ తగలకుండా జాగ్రత్త వహించాలి


డాక్టర్ సుందర్ కుమార్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్

దెందులూరు: ఎండలు మండిపోతున్న నేపథ్యంలో వడదెబ్బ బారిన పడితే డీహైడ్రేషన్ వస్తుందని, సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాలకు సైతం ముప్పుగలిగే ప్రమాదం ఉందని దెందులూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుందర్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన దెందులూరు వైద్యశాలలో వడదెబ్బ లక్షణాలు, చికిత్స వంటి వివరాలపై అవగాహన కల్పించారు. వడదెబ్బ కారణంగా వణుకు రావడం, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, అపస్మారక స్థితి వంటివి కలుగుతాయన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తికి ప్రథమ చికిత్సగా నీడ ఉన్న ప్రదేశానికి తరలించి చల్లని నీటితో శరీరం తుడవాలన్నారు. ఫ్యాను గాలి, చల్లని గాలి తగిలేలా చూడాలన్నారు. ఉప్పు మజ్జిగ , గ్లూకోస్ ద్రావణాలు ఏదైనా పట్టించాలని, వీలైనంత త్వరగా సమీప ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లి వైద్య సేవలు అందించాలని సూచించారు. వేసవికాలంలో అధికంగా మజ్జిగ, కొబ్బరినీరు, మంచినీరు తీసుకోవాలన్నారు. చల్లని రంగు పానీయాలు తాగరాదని, రోడ్లమీద కలుషిత ఆహారం తినవద్దని, మాంసాహారం తగ్గించాలని, మద్యం సేవించరాదని హెచ్చరించారు. నలుపు దుస్తులు, మందంగా ఉన్న దుస్తులు ధరించరాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప సాధ్యమైనంత వరకు ఎండలో తిరగకుండా జాగ్రత్త పడాలన్నారు.

వయోజనులకు ఉల్లాస్ పరీక్ష


గణపవరం: బువ్వనపల్లిలో ఉల్లాస్ పరీక్ష రాస్తున్న వయోజనులు


భీమడోలు: గుండుగొలనులో ఇన్విజిలేటర్లుకు సూచనలందిస్తున్న ఎంఈవో 2 భాస్కర్‌కుమార్

గణపవరం: ఉల్లాస్ కార్యక్రమంలో శిక్షణ పొందిన వయోజనులు ఆదివారం నిర్వహించిన పరీక్షలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గణపవరం, నిడమర్రు మండలాల్లో దాదాపు 47 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ పరీక్ష నిర్వహించారు. గణపవరం మండలంలో మొత్తం 200మంది వయోజనులకు 20 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, నిడమర్రు మండలంలో 270 మందికి 27 పరీక్షా కేంద్రాలలో ఉల్లాస్ పరీక్ష నిర్వహించారు. గణపవరం, నిడమర్రు మండలాల ఏపీఎంలు అమీరున్నీసా, ఎం.రత్నకుమార్ మండల సీఆర్‌పీలు, డీఆర్‌పీ తదితరులు పరీక్షా కేంద్రాలను సందర్శించి, పరీక్ష నిర్వహణను పరిశీలించారు.

భీమడోలు: మహిళల్లో అక్షరాస్యతను పెంపొందించేందుకుగాను ఆదివారం నిర్వహించిన ఉల్లాస్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మండల పరిధిలోని 20 అభ్యాసన కేంద్రాల్లో 250 మంది డ్వాక్రా మహిళలకు శిక్షణ పొందారు. దీనిలో భాగంగా మండల పరిధిలోని భీమడోలు, గుండుగొలను, సూరప్పగూడెం, కురెళ్లగూడెం గ్రామాల్లో రెండేసి చొప్పున కేటాయించిన 8 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. వాటిలో 250 మంది మహిళలు పరీక్షలు రాయాల్సి ఉండగా నూరు శాతం పరీక్షలకు హాజరయ్యారు. కురెళ్లగూడెంలో ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో పరీక్షల నిర్వహణ తీరును డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ పరిశీలించారు. గుండుగొలను పాఠశాలలోని పరీక్షను ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ పరిశీలించి ఇన్విజిలేటర్లుకు పలు సూచనలందించారు. పరీక్షా కేంద్రాలకు ఇన్విజిలేటర్లుగా అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు సీసీలు వ్యవహరించారు. ఏపీఎం రత్నకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కవిత, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'


భీమడోలులో పుస్తక పఠనం చేస్తున్న బాలబాలికలు

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు హాజరైన తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసి పుస్తక పఠనం చేశారు. తెలుగు, ఇంగ్లీషు నీతి కథలు, సైన్సు పుస్తకాలను చదివారు. వాటి సమీక్షలు రాశారు. తొలుత ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం, కవితా దినోత్సవం, అమరవీరుల దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాటి విశిష్టతను గ్రంథపాలకుడు వారికి వివరించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్, అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో భీమడోలు, పూళ్ల, గుండుగొలను లైబ్రేరియన్లు కె.శ్రీనివాస్, డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లెల్లో యథేచ్ఛగా బెల్ట్‌షాపులు


ఓ గ్రామంలోని బెల్ట్ షాపు దుకాణం

పెదవేగి : నియోజకవర్గంలో ప్రతి పల్లెలో బెల్ట్ దుకాణాలు యథేచ్ఛగా నిర్వహిస్తుండడంతో మద్యం ఏరులై పారుతోంది. ప్రభుత్వం బెల్ట్ దుకాణాలపై నిషేధం విధించినా మద్యం వ్యాపారులు నిబంధనలకు తూట్లు పొడుస్తూ విచ్చలవిడిగా గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు ఏర్పాటుచేశారు. ఒక్కో గ్రామంలో ఒకటి నుంచి మూడు దుకాణాల వరకు ఏర్పాటు చేసి నడిపిస్తున్నారు. మండలంలోని కూచింపూడి, కొప్పాక, రామశింగవరం, రాట్నాలకుంట, వేగివాడ, నడిపల్లి, బోగాపురం, అమ్మపాలెం, దిబ్బగూడెం, నాగన్నగూడెం, జానంపేట, ఇతర గ్రామాల్లో గొలుసు దుకాణాలు ఏర్పాటయ్యాయి. బెల్ట్ దుకాణాల్లో లూజు, చీప్ లిక్కర్ విక్రయాలు సాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. గొలుసు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు తెలియనట్లు వ్యవహరించడంపై బహిరంగానే పలువురు విమర్శిస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం బి శింగవరం, బాపిరాజుగూడెంలో ఒక బెల్ట్ దుకాణాన్ని పట్టుకుని కేసు నమోదు చేయకుండా అధికారులు దోబుచులాడారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి బెల్టు దుకాణాలను పూర్తిగా తొలగించాలని స్థానికులు, మహిళలు కోరుతున్నారు.

బాలబాలికలకు ప్రతి ఆదివారం ప్రహ్లాద బడి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఏలూరు శాఖ ఆధ్వర్యంలో బాలబాలికల కోసం ప్రతి ఆదివారం ప్రహ్లాద బడి నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ఏలూరు శాఖ ప్రతినిధి రాధా వల్లభ దాస్ తెలిపారు. ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో ప్రహ్లాదబడి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలల్లో వినయం, విధేయత, సంస్కారం పెంపొందించి, సంతోషంగా ఉండడానికి, ఉజ్వలమైన భవిష్యత్తుకు, మానసిక, వ్యక్తిత్వ వికాసానికి ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఆదివారం బాలలకు భగవద్గీత శ్లోక పఠనం, మంత్ర మెడిటేషన్, నైతిక విలువలు, కీర్తనలు, నృత్యాలు నేర్పుతామన్నారు. ఇతర వివరాలకు 8919387849 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం బాలలకు ఇస్కాన్ ప్రతినిధులు బాలలకు ఉచితంగా పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు.

భగవద్గీత గ్రంథాల పంపిణీ

పోలవరం రూరల్: పోలవరం మండలం పైడిపాక గ్రామంలో భగవద్గీత గ్రంథాలు ఆదివారం పంపిణీ చేశారు. మూలెం వెంకన్నబాబు ప్రోద్భలంతో కర్రి బాలకృష్ణ కుమార్తె కర్రి శ్రీలక్ష్మి భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేశారు. అలాగే భగవద్గీత గురించి భక్తులకు ఆమె తెలియజేసి పారాయణ విధానాన్ని వివరించారు. గునపర్తి చంద్రావతి, మిరియాల నాగమణి, గునపర్తి హేమలతాదేవి, కర్రి వీరలక్ష్మి పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి రూ.లక్ష విరాళం

దెందులూరు: దెందులూరులోని నిర్మాణంలో ఉన్న సాల్వేషన్ ఆర్మీ చర్చికి సేవ్ మిషన్ చైర్మన్ మేడిది నికోల రూ.లక్ష విరాళం అందించారు. చర్చిలో కోర్ ఆఫీసర్ మేజర్ ఎం రమణయ్యకు ఆదివారం ఈ మొత్తాన్ని అందజేశారు. సాల్వేషన్ ఆర్మీ సంఘ పెద్దలు, గృహ సమితి సభ్యులు, సంఘస్తులు దాత నికోలను అభినందించారు.

నిధుల దుర్వినియోగం వాస్తవం కాదు

ఉంగుటూరు: కాగుపాడు పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఆ గ్రామ సర్పంచి కడియాల సుధీష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను ఎటువంటి నిధుల దుర్వినియోగానికి పాల్పడలేదని స్పష్టం చేశారు. గ్రామంలో తాము చేసిన మంచి పనులకు పేరు వస్తుండడాన్ని సహించలేక రాజకీయ దురుద్దేశంతో కొందరు నాయకులు కక్షపూరిత ధోరణితో ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. త్వరలోనే వీటికి సరైన సమాధానంగా డీఎల్‌పీవోకి వివరణ ఇస్తామని సుధీష్ణ వివరించారు. తమపై వస్తున్న ఆరోపణలు నమ్మవద్దని సర్పంచి కోరారు.

రహదారి పనులకు శంకుస్థాపన


రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఉంగుటూరు: ఉంగుటూరు నుంచి నారాయణపురం వరకు రూ.కోటి ఆరు లక్షలతో నిర్మించే లింకు రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ధర్మరాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, ఉంగుటూరు, నారాయణపురం సర్పంచులు బండారు సింధు, దిడ్ల అలకానంద, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ తల్లి ఉత్సవం

దెందులూరు: గ్రామంలోని పెద్దింట్లమ్మ తల్లి ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. శక్తి వేషాలు, నృత్యాలు, మేళ తాళాల నడుమ అమ్మవారిని గ్రామంలో అన్ని వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం

ఏలూరు (టూటౌన్): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు ఆమోదించడంపై ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు బయ్యారపు రాజేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జ్ కాశీ కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాల పాటు అనేక ఒడిదుడుకులు ఎదురొడ్డి నిరంతర ఉద్యమ పోరాటాలు చేసిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అయినపర్తి మాధవరావు, బయ్యారపు కుటుంబరావు, దుగ్గిపోగు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: డ్రైయినేజీ విషయంలో జరుగుతున్న గొడవల నేపథ్యంలో మహిళపై నలుగురు దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలోని మైసన్నగూడెంకు చెందిన జుత్తుక రమణకు, అదే గ్రామానికి చెందిన జుత్తుక గంగారత్నంకు డ్రెయినేజీ విషయంలో గొడవలు ఉన్నాయి. గత నెల 27వ తేదీన రమణ డైపర్లను డ్రెయినేజీలో వేయగా, గంగారత్నం ఎందుకు వేశామని ప్రశ్నించింది. దీంతో రమణ, మరో ముగ్గురు కలిసి గంగారత్నంను కొట్టి, అసభ్యకరంగా ప్రవర్తించారు. విషయాన్ని పెద్దల్లో పెట్టగా పరిష్కారం లభించకపోవడంతో గంగారత్నం ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆర్యవైశ్యులంటే త్యాగానికి, ధర్మానికి ప్రతీక


మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరువీధి వేణుగోపాల్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్యవైశ్యులంటే త్యాగానికి, ధర్మానికి పెట్టింది పేరు అని వాసవి జాగృతి ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరువీధి వేణుగోపాల్ అన్నారు. ఆదివారం స్థానిక ఆదిత్య ప్రిన్స్ హోటల్‌లో వాసవీ జాగృతి ఇంటర్నేషనల్, వాసవీ జాగృతి జయభేరి ఐకాన్ 2025 కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వేణుగోపాల్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల గౌరవ నినాదంతో వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారి సంక్షేమం, అభివృద్ధికి సరికొత్త ఆలోచనలతో వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ సంస్థను స్థాపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డి.రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని, వారికి వివిధ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే దిశగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్.మురళీమోహనరావు, నాదెళ్ల శ్రీనివాసులు, సుంకు చంద్రశేఖర్ గుప్తా, ఏవీవీ గుప్త, జాలూరి కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలి


పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న నిట్ కళాశాల డీన్ రవికిరణ్‌శాస్త్రి

ఉంగుటూరు: క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత స్థానానికి తీసుకువెళుతుందని తాడేపల్లిగూడెం నిట్ కళాశాల మెకానికల్ డీన్ రవికిరణ్ శాస్త్రి అన్నారు. శనివారం రాత్రి ఉంగుటూరు విజ్ఞాన భారతి పాఠశాల వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవికిరణ్ శాస్త్రి, ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డా.కస్తూరి శిరీష మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య అందించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ రమణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీవీ సత్యనారాయణ, కరస్పాండెంట్ పాతూరి వంశీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి


భీమడోలు బాలుర వసతి గృహంలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమడోలు: దేశంలో నేటి మతోన్మాద రాజకీయాలకు విరుగుడు భగత్‌సింగ్ చూపిన లౌకిక, సమ సమాజ మార్గమేనని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. భీమడోలు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఆదివారం అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వార్డెన్ గురుబాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో లింగరాజు మాట్లాడుతూ భగత్‌సింగ్ త్యాగం భావితరాలకు స్ఫూర్తి అని, భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ లాంటి వీరుల త్యాగ ఫలితంగానే నేటి స్వాతంత్ర్యమని అన్నారు. అల్లూరి సీతారామరాజు ప్రాణత్యాగం చేసిన వారి ఆశయాలు నెరవేరలేదని, ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం అట్టడుగు వర్గాల ప్రజలకు నేటికీ అందలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశ ఐక్యతకు భిన్నంగా మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సందడే సందడి


పార్క్‌లో సందడి చేస్తున్న భక్తులు, పిల్లలు

శ్రీవారి కొండపైన చిల్డ్రన్స్ పార్క్‌లో సందడి నెలకొంది. పిల్లల ఆటలతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవుదినం కావడంతో క్షేత్రానికి వేలాది మంది భక్తులు విచ్చేశారు. స్వామివారి దర్శనానంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు తమ పిల్లలతో సమీపంలోని చిల్డ్రన్స్ పార్క్‌లోకి చేరుకున్నారు. చెట్ల నీడలో చిన్నారులు సాయంత్రం వరకు ఆటలాడుతూ కేరింతలు కొట్టారు. ఉయ్యాల ఊగటం, జారుడు బల్లలు జారడం, బాతు బొమ్మలు ఎక్కి తిరగడం, టైరు పట్టుకుని వేలాడటం వంటి ఆటలతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. తల్లిదండ్రులు దగ్గరుండి మరీ ఆటలాడించారు. సాయంత్రం వరకు భక్తుల పిల్లలతో సందడిగా మారిన పార్క్, ఆ తరువాత స్థానికుల పిల్లలతో కళకళలాడింది.

– ద్వారకాతిరుమల